

టీటీడీ ఈవో ధర్మారెడ్డి కుమారుడికి గుండెపోటు

ప్రజాశక్తి-తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళి గుండెపోటుకు గురయ్యారు. చెన్నైలో ఉంటున్న చంద్రమౌళి ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుకు గురవడంతో, అప్రమత్తమైన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చంద్రమౌళికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. చంద్రమౌళి అకస్మాత్తుగా గుండెపోటుకు గురవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

బలహీన వర్గాల ఉన్నతితోనే దేశాభివృద్ధి

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సంక్షేమ బోర్డు జాతీయ కమిటీ సభ్యులు




మాట్లాడుతున్న బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సంక్షేమ బోర్డు జాతీయ సభ్యులు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: బడుగు, బలహీనవర్గాల అభివద్ధే దేశ అభివద్ధి సాధ్యమని బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సంక్షేమ బోర్డు జాతీయ కమిటీ సభ్యులు తుర్క నరసింహ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఆర్వో శ్రీనివాసరావుతో కలసి విద్య, వైద్య, పోలీసు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, స్త్రీ, శిశుసంక్షేమ, గనులు.. భూగర్భ, సంక్షేమ శాఖలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడుగు బలహీన వర్గాల అభివద్ధి, సంక్షేమానికి అమలు పరచే సంక్షేమ పథకాలపై నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలతో ఆర్థికంగా అభివద్ధి చేయాలన్నదే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కమిటీ సభ్యులు జిల్లాల పర్యటనలో భాగంగా జిల్లాలోని బడుగు బలహీన వర్గాలకు కేంద్ర ప్రభుత్వం అమలు పరిచే సంక్షేమ పథకాలు వారికి సకాలంలో అందుతున్నాయా లేదా అని పరిశీలించడం, అధికారులతో సమావేశాలు నిర్వహించి సంక్షేమ పథకాలకు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు పరిచే సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రభుత్వ కార్యాలయాలలో డిస్ప్లే చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు పరిచే సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం బాగా ఉపయోగించు కుంటోందని.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, రాష్ట్రంలో ఇంగ్లీష్ మీడియంతో పాటు సీబీసీఎస్ఈ సిలబస్‌తో పాఠశాలలో బోధిస్తున్నారని తెలిపారు. ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు సైన్స్, ఫిజిక్స్, గణితంపై దష్టి సారించి అనుభవం కలిగిన టీచర్స్‌తో ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులకు మంచి భవిష్యత్ కల్పించాలన్నారు. విద్యలో ఎలాంటి మార్పులు, చేర్పులు చేయాలని, ఉపాధ్యాయులతో ముఖాముఖీగా చర్చ నిర్వహించారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తీసుకొని కేంద్ర ప్రభుత్వానికి పంపాలని జిల్లా విద్యాశాఖ అధికారికి సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులకు సంబంధించి అట్రాసిటీ కేసులు నమోదు చేసి.. వాటిని సత్వరం పరిష్కరించాని సకాలంలో నష్ట పరిహారం చెల్లించాలన్నారు. అట్రాసిటీ కేసుల కు సంబంధించి సమస్యలు ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు పరిచే ఆవాస్ యోజన పథకం ద్వారా రాష్ట్రంలో గృహాల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి చెన్నయ్య, బీసీ సంక్షేమ, సాధికారత అధికారి యుగంధర్, స్త్రీ శిశుసంక్షేమ, సాధికారత అధికారి లక్ష్మి దేవి, భూగర్భ గనులు శాఖల అధికారులు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓటమితో పాఠాలు నేర్చుకోవాలి

- మామూలు పోలీస్ కానిస్టేబుల్ కథే లాఠీ సినిమా
- ఎస్వీసీఈ కళాశాలలో సందడి చేసిన సినీ హీరో విశాల్



- మాట్లాడుతున్న మోహన్‌బాబు

ప్రజాశక్తి-తిరుపతి మంగళం: జీవితంలో ప్రతి రంగంలో ఏదో ఒక సందర్భంలో ఓటమి అనేది పలకరిస్తుందని, ఓటమి చెందాం అనుకోకుండా ఆ ఓటమి నేర్పే పాఠాలను స్ఫూర్తిగా చేసుకుని విజయం కోసం ప్రయత్నాలు చేయాలని సినీ హీరో విశాల్ విద్యార్థులకు సూచించారు. రాణా ప్రొడక్షన్స్ పతాకంపై దర్శకులు వినోద్ కుమార్ దర్శకత్వంలో, రమణ, నందా నిర్మాతలుగా నాలుగు భాషల్లో తెరకెక్కిన 'లాఠీ' చిత్రం ఈనెల 22న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ప్రేక్షకులను సందడి చేయనుంది. ఈ క్రమంలో సోమవారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో 'లాఠీ' చిత్రం ప్రీ రిలీజ్ కోసం చిత్ర కథానాయకుడు విశాల్ హాజరై మాట్లాడారు. ప్రేక్షకులుగా మీరు టికెట్టు కొన్న డబ్బుతో ఓ చిత్ర కథానాయకుడిగా నేను, నా కుటుంబం మూడు పూటలా భోజనం చేస్తున్నా మని, మీరిచ్చిన సొమ్ముతో ఉన్నత చదువులు చదువుకోలేని నిరుపేద విద్యా ర్థులకు చేయూతనివ్వడానికి నాకు అందుతున్న ధనంలో ఒక్క రూపాయి, కళాశాలలో ఉన్న విద్యార్థులు కూడా ఒక్కొక్కరు ఒక్క రూపాయి అందివ్వాలని ఇద్దరు పేద విద్యార్థులకు ఈ విద్యా సంవ త్సరం ఫీజును చెల్లించడానికి అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. లాఠీ సినిమాలో ఓ సాధారణ పోలీస్ కానిస్టేబుల్ జీవితం, అతని కుటుంబం ఒక్కసారిగా ఎదురైన సంఘటనతో ఆ కానిస్టేబుల్ ఎదుర్కొన్న సంఘటనలపై చిత్రం తెరకెక్కిందన్నారు. సమాజాన్ని అభివద్ధి చేయడానికి విద్యార్థులుగా మీరు విద్యను పూర్తి చేసుకొని బయటకు రావాలని ఆశిస్తున్నామన్నారు. సినీ నటులు పవన్ కళ్యాణ్ సినిమాలను ఓ ప్రేక్షకుడిగా థియేటర్లలో కూర్చుని చూశానని, భవిష్యత్తులో అవకాశం వస్తే పవన్ కళ్యాణ్ తో మల్టీస్టారర్ సినిమాల్లో నటిస్తానన్నారు. తదుపరిచిత్రం మార్క్ ఆంటోనీలో గ్యాంగ్ స్టర్ గా నటిస్తున్నానని, డిటెక్టివ్ చిత్రం ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానుందన్నారు. నడిగర సంఘం భవనం ఐకానిక్గా తీర్చిదిద్ది ఆ భవనం ద్వారా వచ్చిన డబ్బులతో వీధుల్లో నటిస్తున్న వారికి పెన్షన్ గా ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నానన్నారు. నా ప్రమేయం లేకుండానే నేను కుప్పం నుంచి పోటీ చేస్తున్నట్టు రాజకీయంగా విమర్శలు కూడా సష్టించారని.. విద్యార్థి అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రీ రిలీజ్ కార్యక్రమానికి బందోబస్తుగా వచ్చిన పోలీస్ కానిస్టేబుళ్లతో సరదాగా ఫోటోలకు ఫోజు ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు తనదైన శైలిలో విశాల్ సమాధానాలు చెప్పి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సినీ హీరో విశాల్ తో సెల్ఫీలు దిగడానికి కళాశాల విద్యార్థులు అధిక సంఖ్యలో పోటీపడ్డారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి, మోహన్ బాబు కళాశాల విద్యార్థులు, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



- పోలీసు సిబ్బందితో సిని హీరో విశాల్

తిరుపతి జిల్లాలో పర్యాటకరంగానికి పుష్కలంగా అవకాశాలు

- డీఆర్వో శ్రీనివాసరావు



పర్యాటక అభివృద్ధిపై మాట్లాడుతున్న డీఆర్ఓ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతి జిల్లాలో పర్యాటక రంగానికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని.. మెరుగైన టూరిజం సర్క్యూట్ అభివద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అన్ని శాఖల సమ్వయంతో సాధ్యమని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా పర్యాటక కౌన్సిల్ మొదటి సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి జిల్లాలో పర్యాటక రంగానికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఇది సుసాధ్యం అవుతుందన్నారు. పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె రోజా పర్యాటక అభివద్ధి కోసం కట్టుబడి ఉన్నారని, జనవరిలో నిర్వహించబోవు ఫ్లెమింగో ఫెస్టివల్ ను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. బీచ్ టూరిజం అభివద్ధికి నవాబ్ పేట బీచ్ నుంచి రాజీ బీచ్ వరకు మధ్యలోని కొత్త బీచ్ ల అభివద్ధి భూ సేకరణ కోసం పర్యాటక శాఖ సీఈవో నుంచి అందిన ప్రతిపాదనలపై 9 ప్రాంతాలలో భూమి గుర్తించేందుకు జిల్లా కలెక్టర్ నుంచి పంపబడిన ప్రతిపాదనలపై గూడూరు ఆర్డీవో, వాకాడు, చిట్టమూరు తహసీల్దార్లు సత్వరమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్ పలు అంశాలపై చర్చించారు. పలువురు కౌన్సిల్ సభ్యులు శ్రీకాళహస్తి లోని కలంకారీ ప్రాసస్త్యాన్ని పెంచుటకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, పౌరాణిక, సాంస్కృతిక సంగీత, నత్య వారసత్వ సంపదను కాపాడుకుంటూ భావితరాలకు అందించే దిశగా మెరుగైన ప్రణాళికలు చేపట్టాలని సూచించారు. తుడా కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ తుడా పరిధిలోని చంద్రగిరి నియోజకవర్గం తదితర ప్రాంతాలలో పర్యాటక సాంస్కతిక అభివద్ధికి తుడా ఛైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో చర్యలు చేపడుతామని తెలిపారు. పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో గ్రామీణ పర్యాటక ప్రాజెక్ట్ కింద శ్రీ కాళహస్తి హెరిటేజ్ సర్క్యూట్ ప్రాజెక్ట్, స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ ఏర్పాటులో భాగంగా గ్రామీణ పర్యాటక ప్రాజెక్ట్ శ్రీకాళహస్తి, పానగల్ గ్రామం వద్ద రూ.19.80 లక్షలతో పనులు పూర్తి చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివద్ధి కార్పోరేషన్ నిర్వహిస్తోందన్నారు. గ్రామీణ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రూ.21.95 కోట్లు మంజూరు కాగా అందులో రూ.13.57 కోట్లతో సురుటుపల్లి, నాగలాపురం, నారాయణవనం, తొండమనాడు, శ్రీనివాసమంగాపురం, శ్రీకాళహస్తి, బొక్కిసంపాళెం, కాణిపాకం అభివద్ధి పనులు పూర్తి చేసి సంబంధిత ఈవోలకు అప్పగించడమైందని, గుడిమల్లం ల్యాండ్ కు, చంద్రగిరి కోటకు సంబంధించిన ఆర్క్యాలజి సర్వే ఆఫ్ ఇండియా వారి అనుమతులు, శ్రీవారి మెట్టుకు సంబంధించిన పనుల అటవీ శాఖా అభ్యం తరాలపై తగిన చర్యలు సంబంధిత అధికారులు చేపట్టాలని కోరారు. జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో రోజుకు 3 వేలమంది పైన పర్యాటకుల సందర్శన, నెలకు రూ.కోటి ఆదాయం వస్తున్న పుణ్యక్షేత్రాలలో పర్యాటక సమాచార కేంద్రాల ఏర్పాటు కోసం శ్రీకాళహస్తి, తాతయ్య గుంట గంగమ్మ , శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి సూళ్ళూరుపేటలోని ఈవోల నుంచి సమ్మతించిన మేరకు సి.ఈ.ఓకు ప్రతిపాదనలు పంపడమైనదని, తిరుపతి జిల్లా స్థానిక, స్థానికేతర టి.టి.డి దేవాలయాల పరిధిలోని ఆవరణలో 500 నుంచి 1000 చదరపు అడుగుల కేటాయింపు కోసం సంబంధిత ఈవోలు చర్యలు చేపట్టి ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. సమావేశంలో గూడూరు, సూళ్ళూరుపేట ఆర్డీవోలు కిరణ్‌కుమార్, రోస్ మాండ్, గిరిధర్, డీఎఫ్‌వో అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్క్యాలజి శివ ప్రసాద్, కౌన్సిల్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

- మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సచివాలయాల్లో స్పందన పిర్యాధులపై ఎప్పటికప్పుడు పరిష్కార చర్యలు తీసుకోవాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతి సోమవారం వచ్చే ఫిర్యాదులను స్వీకరించి జూమ్ మీటింగ్ ద్వారా సంబంధిత సచివాలయ సిబ్బందికి అప్పటికప్పుడే పరిశీలన నిమిత్తం ఇవ్వబడుతుందని, ప్రతి ఒక్క సచివాలయంలో అడ్మిన్ ఆధ్వర్యంలో సెక్రటరీలు అందుబాటులో ఉండాలని కమిషనర్ అనుపమ అంజలి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి ఫిర్యాదులను స్వీకరించారు. తిరుపతి ఉపాధ్యాయ నగర్లో టెంపుల్ బెల్స్ అపార్ట్మెంట్ వారు తమ స్థలంలోకి మురుగునీరు వదిలేస్తున్నారనే ఫిర్యాదుపై పరిశీలించి పరిష్కరి స్తామన్నారు. రైల్వే కాలనీ, భవానీనగర్‌కు వెళ్లే దారిలో పాతసామాన్లు, ఇసుక, ఇటుకలు పెట్టుకొని వ్యాపారం చేస్తుండ టంతో రాకపోకలకు ఇబ్బందు లుగా ఉన్నాయనే ఫిర్యాదుపై స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఓల్డ్ తిరుచానూర్ రోడ్డులో మునిసిపల్ డ్రైన్ ను, రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారనే ఫిర్యాదుపై స్పందిస్తూ తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. ఐద్వా నాయకులు తమ ఫిర్యాదులో గిడ్డంగి వీధిలోని ఐరన్ పోల్ నుంచి విద్యుత్తు ప్రవహిస్తోందని.. కేటీ రోడ్డులోని ఓరియన్ హోటల్ వద్ద డ్రైనేజ్ ఓవర్ ఫ్లో అవుతుందనే ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, లోకేష్ వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణ, సెక్రటరి రాధిక, మేనేజర్ చిట్టిబాబు, డీఈ విజయకుమార్ రెడ్డి, సూపరింటెండెంట్ పి.రవి, మెప్మా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలివ్వాలి :సిఐటియు



ప్రజాశక్తి- సత్యవేడు : గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్ వేతనాలను ఇవ్వాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి ఎం.రమేష్ అన్నారు. సోమవారం సత్యవేడు ఎంపీడీవో కార్యాలయం వద్ద తమ సమస్యలు పరిష్క రించాలని ఎంపీడీవోకి అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి మాట్లాడుతూ దాదాపు 30 నెలలు పైబడి అవుతున్న కార్మికులకు నెలకు 6000 జీతం కూడా సక్రమమైన పద్ధతుల్లో ఇవ్వకుండా వారి కుటుంబాలు ఎలా పోషించుకోవాలన్నారు. పనిభద్రత లేకుండా వెట్టి చాకిరి చేయించు కోవడం చాలా అన్యాయమని ఇది వరకే అధికారు లకు అనేకసార్లు అర్జీలు సమర్పిస్తున్నా కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరస్తుందన్నారు. ఎంపీడీవో ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొని పోయి పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి డి.అరుణాచలం, గ్రీన్ అంబాసిడర్ కార్మికులు మునుస్వామి, చంద్రయ్ పొన్నుస్వామి, చెల్లయ్య చంద్ర బాబు, మోహన్, ఆర్ముగం, ఏలుమలై, శంకర్, శేఖర్, మురుగయ్య, రాజేంద్రన్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయాల్లో.. నాణ్యమైన విద్యకు చర్యలేంటి?

- తిరుపతి ఎంపీ గురుమూర్తి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: కేంద్రీయ విద్యాలయాల్లో నాణ్యమైన విద్యను అందించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేంటని తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి ప్రశ్నించారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా సోమవారం ఆయన లోక్‌సభలో మాట్లాడారు. కేంద్రీయ విద్యాలయాల్లో పర్యవేక్షణ, ఆడిట్‌కు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని కోరారు. అలాగే కేంద్రీయ విద్యాలయాల్లో ఖాళీల సంఖ్య, వాటి పెండింగ్ వివరాలను రాష్ట్రాల వారీగా ఇవ్వాలని కోరారు. ఖాళీల భర్తీ కోసం కేంద్ర ప్రభుత్వం రిక్రూట్‌మెంట్ చేపట్టిందా? దానికి కాలపరిమితి వివరాలను ఇవ్వాలన్నారు. ఎంపీ ప్రశ్నలపై కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి అనుపమాదేవి సమాధానం ఇచ్చారు. కేంద్రీయ విద్యాలయాల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ చేపట్టామన్నారు. అలాగే ప్రధానోపాధ్యాయులు, కేంద్రీయ విద్యాలయ సంగతన్ హెడ్ క్వార్టర్స్, ప్రాంతీయ కార్యాలయాల అధికారులు నిత్యం పర్యవేక్షిస్తుంటారని చెప్పారు. కేంద్రీయ విద్యాలయాల పనితీరును కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ క్రమంతప్పకుండా సమీక్షిస్తూ పర్యవేక్షిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా కేంద్రీయ విద్యాలయాలలో 14,461 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. కేంద్రీయ విద్యాలయ సంగతన్ (కేవీఎస్) తెలియజేసిందన్నారు. ఇటీవల ఖాళీల భర్తీ ప్రక్రియను కేవీఎస్ ప్రారంభించిందని తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ కేంద్రీయ విద్యాలయాలలో 698 ఖాళీలు ఉన్నాయని చెప్పారు.

నేషనల్ ఫోరెన్సిక్ యూనివర్సిటీ ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి తన నియోజకవర్గ పరిధిలో అభివద్ధి చేసేందుకు పార్లమెంట్ సమావేశాలను చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ఐఐటీ, ఐషర్, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీ (ఐఐడీటీ) తదితర జాతీయ ప్రాధాన్యం గల విద్యా సంస్థలకు తిరుపతి కేంద్రమైంది. అలాగే ఏడు విశ్వ విద్యాలయాలు, వైద్యశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలతో తిరుపతి ఎడ్యుకేషన్ హబ్‌గా తయారైంది. ఈ నేపథ్యంలో తిరుపతిలో నేషనల్ ఫోరెన్సిక్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని సోమవారం లోక్‌సభ సమావేశాల్లో డాక్టర్ గురుమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను ఆయన ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఫోరెన్సిక్ నిపుణుల కొరత తీర్చే అవకాశం లభిస్తుంది. అలాగే లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల డిమాండ్లను తీర్చడానికి ఈ విశ్వవిద్యాలయం దోహదపడుతుందని ఆయన కేంద్ర ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లారు. నేషనల్ ఫోరెన్సిక్ యూనివర్సిటీ, దాని అనుబంధ క్యాంపస్‌ను తిరుపతిలో నెలకొల్పడం ద్వారా ఫోరెన్సిక్ సైన్సెస్ ప్రపంచీకరణ ప్రక్రియలో, దేశంలోని శాస్త్రీయ పరిశోధ నాత్మక నిపుణులను వెలికి తీయొచ్చని కేంద్ర ప్రభుత్వానికి వివరించారు.

పెన్షన్ రివిజన్ సాధనకు ధర్నా



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అఖిల భారత బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగుల, అధికారుల సంక్షేమ సంఘాల కేంద్ర నాయకత్వం పిలుపు మేరకు సోమవారం స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద 7వ వేతన సంఘం ఫిట్మెంట్ ఫ్యాక్టర్ ప్రకారం పెన్షన్ రివిజన్ చెయ్యాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు తులసి దాస్, జిల్లా కార్యదర్శి సౌందర రాజన్, రామచంద్రయ్య, గుర్రప్ప, కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం రాజు, వెంకటయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎస్వీ వ్యవసాయ కళాశాల వజ్రోత్సవ వేడుకలు



ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల వజ్రోత్సవ వేడుకలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల యాజమాన్యం, పూర్వ విద్యార్థుల సంఘం సంయుక్తంగా కళాశాల వజ్రోత్సవం వేడుకల్లో పాల్గొనేందుకు దేశం నలుమూలల నుంచి 600 మందికి పైగా పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో 1961 వ సంవత్సరం నుంచి వ్యవసాయ డిగ్రీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ విద్య పూర్తి చేసుకుని వ్యవసాయ శాఖలో, బ్యాంకింగ్ రంగంలో, వివిధ సేవా రంగాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయి హోదాల్లో పని చేసిన, ప్రస్తుతం పని చేస్తున్న అధికారులు, వ్యాపార రంగంలో స్థిరపడిన వారు వేడుకల్లో పాల్గొన్నారు. వజ్రోత్సవాలు వేడుకల కోసం శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలను యాజమాన్యం సుందరీకరించడంతోపాటు విద్యార్థుల సహకారంతో శ్రీవారి శంకు, చక్ర, నామాల ప్రతిష్టించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, అధికారులు, పూర్వ విద్యార్థుల సమక్షంలో శంకు, చక్ర నామాలకు పూజలు నిర్వహించి ప్రారంభించారు.

తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల వజ్రోత్సవ పూర్వ విద్యార్థుల సమావేశాన్ని పశు వైద్య కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఎఆర్) మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గజేంద్ర సింగ్ పరోడా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథులుగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జి. రామారావు, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఐ. రామచంద్రారెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ డబ్ల్యు.ఆర్.రెడ్డి, మాజీ ఉపకులపతి డాక్టర్ పి.రాఘవరెడ్డి, తూ.గో జిల్లా కలెక్టర్ డాక్టర్ మాధవీలత, శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ వి. పద్మనాభ రెడ్డి తదితరులు హాజరై శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల 60 సంవత్సరాల ప్రగతిని క్రోడీకరించి సిద్ధం చేసిన సావనీర్ విడుదల చేశారు. ఇదే వేదికపై వజ్రోత్సవ చిహ్నాన్ని ఆవిష్కరించారు. శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్. పి. వాసంతి కళాశాలలో ఆవిర్భావం నుంచి నేటి వరకు సాధించిన ప్రగతి నివేదికను ఆమె నివేదించారు. పూర్వ విద్యార్థులు, అతిథులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి కారణమైన కళాశాలకు రుణపడి ఉంటామని సంతోషం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం జాతీయ స్థాయి ఎంత కీర్తి గడిచిందని, కబ్జాల చరిత్ర కలిగిన ఈ విశ్వవిద్యాలయం ఎంతోమంది వ్యవసాయ రంగ నిపుణులు సిద్ధం చేసి దేశ సేవకు అంకితం చేసిందన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యా లయం అందమైన వ్యవసాయ విద్యను అందించే జాతీయ స్థాయిలో 11వ స్థానంలో నిలిచిందన్నారు. బోధన బోధ నేతల సిబ్బంది కషి పరిశోధనల ఫలితంగా ఈ గుర్తింపు సాధించామని, భవిష్యత్తులో అనేక పరిశోధనలకు నిలయంగా ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం మారుతుందని ఆయన ప్రకటించారు.


వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలను ఆదర్శవంతమైన కళాశాలగా తీర్చిదిద్దామని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో భారత వ్యవసాయ పరిశోధన మండలి మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజేంద్ర సింగ్ పరోడా మాట్లాడుతూ దేశంలో గ్రామీణ యొక్క ఎక్కువగా ఉందని.. వారు నైపుణ్యాలు పెంచడం ద్వారా గ్రామీణ, వ్యవసాయ అభివద్ధి జరుగుతుందని అభిప్రాయ పడ్డారు. మన ముందు సుస్థిర వ్యవసాయ అభివద్ధి లక్ష్యాలు ఉన్నాయని, వాతావరణ మార్పులను తట్టుకొని వ్యవసాయ రంగంలో సుస్థిరాభివద్ధి సాధించడం కోసం వ్యవసాయం వైపు యువతను ఆకర్షించాలని, వ్యవసాయ రంగంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని శాస్త్రవేత్తలకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో రాష్ట్ర డిప్యూటీ స్పీకర్



ప్రజాశక్తి -తిరుమల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరపతి లేని పార్టీలు ఏకమై అధికార దాహంతో ఎన్ని తప్పులు చేసైనా అధికారంలోకి వచ్చేలా చూస్తున్నారని రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు సంతోషంగా ఉన్న ప్రతిపక్షాలు సుఖంగా లేరని అవాస్త వాన్ని చిత్రకరిస్తు న్నారని ఆయన తెలిపారు.

ఓటర్ల జాబితా పరిశీలించండి



తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-నాయుడుపేట: మార్చి 2023 సం॥లో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు నమోదైన ఓట్ల జాబితాను మరోసారి పరిశీలించాలని నాయుడుపేట యూటీఎఫ్ నాయకులు నాయుడు పేట సీపీఎం నాయకులు శివకవి, ముకుంద ఆధ్వర్యంలో నాయుడుపేట తహశీల్దార్ ఎ.రాజేంద్రకు వినతిపత్రం ఇచ్చారు. ఈ ఓట్ల జాబితాలో జరిగిన అవకతవకలను సరిచేయాలని అక్రమాలకు తావివ్వకుండా బోగస్ ఓట్లను కనుగొని పరిశీలించవలసిందిగా కోరారు. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం తహశీల్దార్ పరిధిలో మరోసారి జాబితాలోని ఓటర్లను పీఎఫ్, ఈపీఎఫ్ లేదా బ్యాంకు ద్వారా చెల్లించిన జీతాల వివరాలు పరిశీలించి సరైన ఓటర్లను గుర్తించాలని తహశీల్దార్‌ని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాజశేఖర్, శేఖర్, సుబ్బారావు, గోవర్ధన్ రెడ్డి, శంకరయ్య, రమేష్ రెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

పట్టుదలతో ఉన్నత శిఖరాలకు..



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కృషి, పట్టుదల, అంకితభావం ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహించడం కష్టమేమీ కాదని స్కిమ్స్ బి-స్కూల్ అధినేత మల్లెల హరి అన్నారు. శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి సమీపంలో ఉన్న స్కిమ్స్ బి-స్కూల్లో సోమవారం నుంచి ఎంబీఏ, ఎంసీఏ కోర్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు కళాశాలకు సంబంధించిన లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. నూతనంగా అడ్మిషన్లు పొందిన విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ప్రిన్సిపాల్ రఘురామిరెడ్డి, ప్రొఫెసర్ రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం న్యాయం చేయాలి

ప్రజాశక్తి-ఏర్పేడు: మాండూస్ తుపాను కారణంగా చింతలపాలెం ఎస్టీలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తలారి బాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కురిసిన మూడు రోజుల తుపాను వల్ల చింతలపాలెం ఎస్టీ కాలనీలోని రోడ్లలో ఇళ్లల్లో నీళ్లు ఉండటం వల్ల కాలనీవాసులు ఇబ్బందులుపడుతున్నారు. వారికి జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంపాటి గురవయ్య, నివాసులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్(బ్రాంచి3) శ్రీకాళహస్తి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్ నాయుడు పిలుపునిచ్చారు. శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో సోమవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడమే యువత ప్రాణాలు కోల్పోవడానికి కారణాలవుతున్నాయని చెప్పారు. ట్రాఫిక్ ఎఎస్‌ఐ రియాజ్ బాషా, ప్రిన్సిపాల్ రమణ, ఏజీఎం శ్రీనివాసులు, డీన్ కేదార్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రూరల్ మండలంలోని వేపగుంట పంచాయతీ దళితవాడలో పారిశుధ్యంపై డ్రైనేజీ కాలువలు, పారిశుధ్య కార్మికుల సహకారంతో సర్పంచ్ గిరిప్రసాద్ సోమవారం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా డ్రైనేజీలో మట్టి చేరిపోయినందున మురికినీరు వెళ్లకుండా ఎక్కడ నీరు అక్కడ నిలిచిపోయి దోమలు చేరుతున్నాయి. ప్రజలకు దోమల వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని ఉద్దేశంతో గ్రామాల్లో పారిశుధ్యం తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మంత్రి ఆర్కే రోజా ఆదేశాల మేరకు చేపడుతున్నామని తెలిపారు. మిగిలిన సమస్యలు ఉన్న వాటిపై కూడా దృష్టి పెడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



రామలింగయ్యకు డాక్టరేట్ ప్రదానం


ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ప్రాచ్య పరిశోధన సంస్థ తెలుగు విభాగంలో పరిశోధన చేసిన రామలింగయ్యకు డాక్టరేట్ అవార్డు ప్రదానం చేస్తున్నట్లు ఎస్వీయూ పరీక్షల నియంత్రణాధికారి ఎం.దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్వీయూ ప్రాచ్యపరిశోధన సంస్థలో సహాయ ఆచార్యులుగా పని చేసే ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో "డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ సాహిత్యం -పరిశీలన" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఇందుకుగాను ఆయనకు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసినట్లు వెల్లడించారు. రామలింగయ్య పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్సులో అనేక పరిశోధనా పత్రాలను ప్రచురించారు. రామలింగయ్యకు డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.



బాలోత్సవంలో 'విశ్వం' విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి - క్యాంపస్ : డిసెంబర్ 17, 18న తిరుపతిలో అత్యున్నత స్థాయిలో నిర్వహించిన బాలోత్సవంలో వివిధ పోటీలలో విశ్వం విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించి సత్తా చాటారని విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వ నాథ్ రెడ్డి తెలిపారు. వేలాది మంది విద్యార్థులు పాల్గొన ఈ కార్యక్రమంలో విశ్వం స్కూల్ విద్యార్థులు పాల్గొని కథా రచన విభాగంలో ఎం.మేఘన ప్రథమ బహుమతి, వ్యాసరచన పోటీల్లో పి.వైష్ణవి ద్వితీయ బహుమతి, మట్టిబొమ్మ తయారిలో కే.సంతోష్ ద్వితీయ బహుమతి, మెమరీ టెస్ట్ పోటీలో ఎస్.తస్లీమా, జానపద నృత్యం సీనియర్ విభాగంలో బీ.సుష్మిత బృందం ద్వితీయ బహుమతి, జానపద నృత్యం జూనియర్ విభాగంలో వీ.చరిష్మా బృందం తృతీయ బహుమతి, సైన్స్ ఎగ్జిబిట్ విభాగంలో పీ.ఉషారాణి తృతీయ బహుమతులు సాధించి ప్రతిభ కనబరిచి జిల్లాలోని ప్రముకులచే ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వ చందన్ రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసి విశ్వనాథ్, ప్రధానోపాధ్యాయులు పి.సి.సుబ్రమణ్యం ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.



ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ

రేణిగుంట : తిరుపతిలోని ఎస్‌పిజెఎన్ ఎంహై స్కూల్‌లో బాలోత్సవ్ పిల్లల పండగ కార్యక్రమం నిర్వహించారు. అందులో రేణిగుంట పట్టణంలోని పాంచాలి నగర్‌లో ఉన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థి సీనియర్, జూనియర్ సబ్ జూనియర్ విభాగాలలో పిల్లలు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. అందులో పి.రాజు పదవ తరగతి విద్యార్థి మ్యాప్ పాయింటింగ్ సీనియర్ కేటగిరీలో ప్రథమ బహుమతిని గెలుపొందారు. టెంకాయలు దామోదరం చేతుల మీదుగా బహుమతులు సోమవారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట సిపిఎం నాయకులు ఓ.వెంకటరమణ కూడా పాల్గొన్నారు.

సత్తా చాటిన 'ఇన్‌ఫాంట్ జీసస్' విద్యార్థులు

- జాతీయ స్థాయిలో పతకాల పంట
- 17 గోల్డ్, 13 సిల్వర్, 25 బ్రాంజ్ మెడల్స్ సొంతం



ప్రజాశక్తి-రేణిగుంట: నేషనల్ లెవెల్‌లో జరిగిన గోజు-రై కరాటే పోటీలలో పాల్గొన్న రేణిగుంట ఓల్డ్ చెక్‌పోస్ట్‌లోని ఇన్ఫాంట్ జీసస్ విద్యార్థులు సత్తా చాటి పతకాల పంట పండించారు. ఒకటి కాదు రెండు కాదు ఒకేసారి 50కి పైగా మెడల్స్ సాధించి ఇన్ఫాంట్ జీసస్ స్కూల్‌ను నేషనల్ లెవెల్‌లో నిలిపి తమ సత్తాను చాటారు. చిత్తూరులో అంతర్జాతీయ గోజు-రై కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా గ్రాండ్ మాస్టర్ సుందర్ మూర్తి ఆధ్వర్యంలో ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ నుంచి సుమారు వెయ్యి మందితో రెండు రోజులపాటు జరిగిన నేషనల్ గోజు-రై కరాటే పోటీలలో ఇన్ఫాంట్ జీసస్ విద్యార్థులు పాల్గొన్నారు. కటాస్, ఫైట్ విభాగాలలో పాల్గొన్న విద్యార్థులు ఉత్తమ ప్రదర్శనలను చూపి 17 గోల్డ్ మెడల్స్, 13 సిల్వర్ మెడల్స్, 25 బ్రాడ్జ మెడల్స్ సాధించి జాతీయస్థాయిలో ఇన్ఫాంట్ జీసస్ స్కూల్‌ను నిలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను ఇన్ఫాంట్ జీసస్ పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ సైమన్ గుడిమి, హెచ్‌ఎం డి.ఆల్ఫ్రెడ్ ప్రేమ్‌చంద్, టీం ఆర్గనైజింగ్ సౌందర్య, కరాటే మాస్టర్‌లు దేవా, ఆనంద్, ముకుంద సోమవారం అభినందించారు.



డెక్కన్ ఎడ్యుకేషన్ సొసైటీతో..

మహిళా వర్సిటీ అవగాహన ఒప్పందం



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, డెక్కన్ ఎడ్యుకేషన్ సొసైటీ, ఫెర్గ్యాస్సన్ సెంటర్ ఫర్ హయ్యర్ లెర్నింగ్, కుర్రకాలువ, రేణిగుంట మండలం, తిరుపతి సంస్థల మధ్య సోమవారం అవగాహన ఒప్పందం జరిగింది. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య డి.ఎమ్. మమత, డెక్కన్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ డా. సచిన్ ప్రభాకర్ ఖేడ్కర్‌లు పరస్పరం అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంతో డెక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థులకు బోధన పరిశోధనా అంశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించు కోవడానికి వీలు కలుగుతుందన్నారు. పరిశోధన, అభివృద్ధి, విద్య, శిక్షణ, సాంకేతికత రంగాల్లో పరస్పర ఆసక్తిని గుర్తిస్తూ ఈ ఎంవోయూ విద్యార్థులకు కెరీర్, ఉపాధి అవకాశాలతో కూడిన వివిధ రంగాల్లో విద్యను అందించనుందని ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున వెల్లడించారు. దీర్ఘకాలికంగా ఇప్పుడు వాణిజ్య ప్రాతిపదికను జ్ఞానం, సామాజిక అభివృద్ధికి అధిక సహకారం అందించడంలో ఉన్నత విద్యా సంస్థల పాత్ర ప్రాముఖ్యతను గుర్తించడం అవసరమన్నారు. 3 నెలల సర్టిఫికేట్ కోర్సును అందించడం ద్వారా ఆహార భద్రత, ఆహార నాణ్యత, సూక్ష్మజీవుల ప్రయోగశాల పద్ధతులు, జ్యూవెలరీ డిజైనింగ్ రంగాలలో నైపుణ్యాభివృద్ధిలో విద్య, శిక్షణను ఈ అవగాహన ఒప్పందం ప్రోత్సహిస్తుందన్నారు. దీని ద్వారా స్థానిక ప్రజలను ప్రధానంగా మహిళలు, బాలిక విద్యార్థునులను ఉద్యోగ ఆధారితంగా వారి నైపుణ్యాలను పెంచుకోవాలని ప్రోత్సహి స్తుందని డాక్టర్ సచిన్ వివరించారు. ఈ ఒప్పందం 3 సంవత్సరాల పాటు అమలులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొ.డి.ఎం.మమత రిజిస్ట్రార్, డా.బి.గీతావాణి డిప్యూటీ రిజిస్ట్రార్, ప్రొ.ఎం. అరుణ, విభాగ అధిపతి, డా.వి.బిందు, డా.జి.శిరీష, గృహ విజ్ఞానశాస్త్ర విభాగం, డా.జయశ్రీ, డా.సోమశేఖర్ పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూస్తాం: ఎంపీడీఓ



ప్రజాశక్తి -బాలాయపల్లి : మండలంలో యూరియా కొరత లేకుండా చూస్తామని ఎంపీడీఓ వినీల్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న 15 సచివాలయాలకు గాను 12 సచివాలయాలకు యూరియా పంపిణీ చేయడం జరిగిందన్నారు. జయింపు, హస్త కావేరి సచివాలయాలకు యూరియా రావడం జరిగిందన్నారు. రైతులకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ అధికారిణి శిరీష మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 9 ఎకరాలు వరిసాగు చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం ఎక్కడ రైతులకు యూరయ అవసరమై ఉందో ఆ సచివాలయం పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా అందిస్తున్నామన్నారు. రూ.267లకే బస్తా యూరియా ఇవ్వడం జరుగు తుందన్నారు. మండలంలో ఆర్‌ఎన్‌ఆర్ రకం-150-48 70 శాతం రైతులు వేస్తున్నారని చెప్పారు. 30 శాతం ఎన్‌ఎల్‌ఆర్ 34449 పెద్ద మసుర, బీపీటీలు సాగు చేస్తున్నారని చెప్పారు. మండలంలో యూరియా కొరత లేకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇంటి స్థలం మంజూరు చేయాలని వినతి



ప్రజాశక్తి -బాలాయపల్లి : గత 15 ఏళ్ల నుంచి మండలంలోని జయింపు గ్రామ రైల్వే స్టేషన్ సమీపం వద్ద ఉన్న చెట్లు కింద నివసిస్తున్నామని తమకు ఎటువంటి ఆధారం లేదని, ఇంటి స్థలం మంజూరు చేయాలని తహశీల్దారు అజ్మీతుల్లఖాన్ చిత్తూరు లక్ష్మమ్మ సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భర్త లేక ఇళ్లల్లో పాచిపని చేసుకుంటూ తన బిడ్డని జయంపు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదివిస్తున్నాని తల దాచుకునేందుకు ఎటువంటి ఆధారం లేదన్నారు. గతంలో అధికారులు చుట్టూ తిరిగానని ఏ అధికారి కనికరం చూపలేదన్నారు. జగనన్న కాలనీలలో తమకు స్థలం మంజూరు చేయాలని అక్కడికి వచ్చిన అధికారుల్ని, నాయకుల్ని దండం పెట్టి వేడుకున్న ఒక్కరు సాయం చేయలేదన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఉందని, కష్టపడి తన బిడ్డని చదివించు కుంటున్నానని తెలిపింది. అధికారులు స్పందించి ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరింది. స్పందించిన తహశీల్దార్ అజ్మీతుల్ల ఖాన్, వీఆర్‌ఓ క్రిస్టియన్ సంబంధిత వాలంటీర్ సహకారంతో పరిశీలన చేపట్టి 15 రోజుల్లో ఇంటి స్థలం ఇచ్చేలా ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఆలయ కుంభాభిషేకానికి రూ. 20,116 విరాళం

ప్రజాశక్తి - పుత్తూరుటౌన్ : రూరల్ మండలంలోని తడుకు పంచాయతీ, మిట్టపాళ్యం స్థిర నివాసి, హైదరాబాదులో ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త గౌరవ కొండేటి రామ్మూర్తి మిట్టపల్లూరు సీతారాముల ఆలయ కుంభాభిషేకం సందర్భంగా తనవంతుగా రూ.20116 లను విరాళాలుగా ఇచ్చి తన దాతృత్వాన్ని తన ప్రాంతం పట్ల ప్రేమను చాటారు. ఈ సందర్భంగా మెట్టుపల్లూరు గ్రామ ప్రజలు, ఆలయ నిర్వాహకులు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థి దశ నుంచే గీతాపఠనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : విద్యార్థి దశ నుంచే భగవద్గీత పఠనం చేయాలని శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మల్లెంబాకం ముని కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పలువురు విద్యార్థులకు భగవద్గీత గ్రంథాలను అందజేశారు. భగవద్గీతను చదవడం, దాన్ని అవగాహన చేసుకోవడం ద్వారా వ్యక్తి సన్మార్గంలో నడిచేందుకు దోహదపడుతుందని తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో కార్వేటినగర్ రోడ్డు గల డాక్టర్ వైఎస్ఆర్ సమావేశం మందిరంలో నేడు మంగళవారం ఉదయం 11 గంటల వరకు మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్‌లు ఆధ్వర్యంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కేఎల్‌ఎం రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌన్సిల్ ప్రత్యేక సమావేశ కౌన్సిలర్లు. కో-ఆప్షన్ మెంబర్లు, సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొనాలని తెలిపారు.

పండ్లు, దుస్తులు పంపిణీ



ప్రజాశక్తి-పాకాల: సెమీ క్రిస్మస్ సందర్భంగా తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంట్ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ సోమవారం పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. కావలివారిపల్లి, రాములవారి గుడి అభివృద్ధికి పదివేల నూట పదహారు రూపాయలు విరాళం అందజేశారు. మండలంలోని గానిగపెంట, మణిపురెడ్డిపల్లి ఎస్టీ కాలనీ, పాకాల క్వార్టర్స్, పరిసర గ్రామాలలోని పేదలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవసహాయం, మురళి రెడ్డి, గజ, గోపి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతు మృతి





ప్రజాశక్తి - కెవిబిపురం: మండలంలోని పాతపాలెం రాయల్‌చెరువుకు గండిపడుతుందని సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులకు తెలుసు. కానీ దాన్ని మరమ్మతులు చేపట్టకపోవడం ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం. దీంతో పంట పొలాలకు నీరు అవసరం అని నీరు తూము నుండి వృధాగా వెళ్లిపోతాయన్న ఉద్దేశంతో చెరువు తూమును అధికారులు మరమ్మతులు చేయాల్సి ఉంది. అధికారుల నిర్లక్ష్యం వహించడం వలన రైతులు వెళ్లి గండికి బస్తాలు మోస్తూ లోతైన గొంతులో పడిపోవడంతో రమేష్ 45 అని రైతు మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు విషాదంలో మునిగారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఇది అధికారుల నిర్లక్ష్యం గనుక ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి 50 లక్షల రూపాయల నగదును నష్టపరిహారంగా ఇప్పించాలన్నారు. ఇరిగేషన్ శాఖలో ఆ కుటుంబానికి మృతుడి భార్య అయిన వరలక్ష్మికి ఉద్యోగం కల్పించి కుటుంబంలోని ముగ్గురు సంతానానికి ప్రభుత్వం తోడ్పడాలని సిపిఎం సత్యవేడు డివిజన్ ఇన్‌చార్జ్ దాసరి జనార్ధన్ సోమవారం రాత్రి 8 గంటలకు మృతుడు కుటుంబాన్ని ఓదార్చారు

రాబోవు పరీక్షలకు విద్యార్థుల ప్రణాళిక సిద్ధం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాబోవు పరీక్షలకు విద్యార్థులను ప్రణాళిక ప్రకారం సబ్జెక్టు వారీగా ఉత్తమ ఫలితాలు లభించే విధంగా చర్యలు తీసుకోవాలని డీసీఓ విజయభారతి అన్నారు. సోమవారం. గోపాలకృష్ణపురం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చిత్తూరు, తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న గతంలో జూనియర్ అధ్యాపకులుగా పనిచేసే గత సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆచార్యులను స్వాగతించి అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుమిత్రా దేవి ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. అనంతరం అధ్యాపకులకు డీసీఓ చేతుల మీదుగా ఘనంగా శాలువా కప్పి పూలమాలవేసి సత్కరించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించండి



ప్రజాశక్తి- యర్రావారిపాలెం: మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నందుకు కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న మహాదీక్ష నిరసనలో భాగంగా మండలంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుండి తహశీల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు పల్లెపాకు నాగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా వెంటనే పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లె రవి, పాపయ్య, నాగార్జున, రమేష్, మోహన, నవీన్, అనిల్, గిరి, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మాండోస్ తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తుపాను బాధితులను ఆదుకోవాలంటూ శ్రీకాళహస్తి తహశీల్దార్ జరీనాకు వినతి పత్రం అందజేశారు. పంట నష్టం ఎకరాకు కనీసం రూ.10 వేలు రూపాయల వరకు కనీస పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారులు పూర్తిస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి బాధితులకు అండగా నిలబడాలని కోరారు. వెంకటేష్, కేశవ, శరత్ కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి వైసీపీ తిలోదకాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : వైసీపీ ప్రభుత్వం దళితుల అభివృద్ధికి తిలోదకాలు ఇచ్చిందని టీడీపీ ఎస్సీ సెల్ విభాగం నాయకులు విమర్శించారు. ఆ పార్టీ రాష్ట్ర అధిష్టానం పిలుపు మేరకు శ్రీకాళహస్తి ప్రాంత ఎస్సీ సెల్ నాయకులు తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. టీడీపీ హయాంలో దళితుల సంక్షేమం కోసం 29 పథకాలను చంద్రబాబు నాయుడు గుర్తు చేశారు. అయితే వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆ పథకాలను రద్దుచేసి దళితుల అభివృద్ధికి గండి కొట్టిందంటూ మండిపడ్డారు. ఎస్సీ సెల్ నాయకులు గాదిపాకల గోపీనాథ్, మెరిమి వెంకటసుబ్బయ్య, సుబ్బయ్య, కూలిసన్ని, రామకృష్ణ పాల్గొన్నారు.

తహశీల్దార్ శివ ప్రసాద్ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట ముస్లిం మైనార్టీ సోదరుల ఆధ్వర్యంలో రేణిగుంట తహశీల్దార్ కార్యా లయంలో శివ ప్రసాద్ జన్మదిన వేడుకలను ఘనం గా జరుపుకున్నారు. వైసీపీ మైనారిటీ మండల ప్రెసిడెంట్ అబ్దుల్ ఖదీర్ మాట్లాడుతూ మంచితనానికి మారుపేరు పేదల కష్టాలు తీర్చే అధికారి శివప్రసాద్ అని కొనియాడారు. గుర వరాజు పల్లి సర్పంచ్, రహీమ్, రహమతుల్లా, రేణిగుంట ముస్లిం మైనార్టీ జర్నల్ సెక్రెటరీ ఎస్ అలీ. సోదరులు, షాజహాన్, బావాజీ, సాదిక్ భాషా, మస్తాన్, రేష్మ, షఫీ, అక్బర్ అబ్దుల్ రెహమాన్, జకిరియ, అబ్దుల్లా, ఇబ్రహీం, రఫీ పాల్గొన్నారు.